క్లుప్తంగా

సత్ప్రవర్తన అలవర్చుకోండి..



మాట్లాడుతున్న 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్

సత్తుపల్లి: ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకొని క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం సత్తుపల్లి సబ్‌జైల్‌ను సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. పలురకాల చట్టాలను వివరించారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వడ్డి లావణ్య, న్యాయవాదులు వెంకట్రావ్, విజయ్‌కుమార్, జైల్ సూపరింటెండెంట్ ఉబ్బల కుటుంబరాజు, జైల్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఛత్రం బహూకరణ

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి శివారులో గల పులిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని స్వామివారి రథయాత్ర కోసం ఏపీలోని నందిగామ వాస్తవ్యులు పసుమర్తి సాయి చరణ్, వెంకట సాయి శృతి ఛత్రాన్ని బహూకరించారు. బోనాల వీరభద్రరావు, రాధాకృష్ణమూర్తి, రవీంద్ర కుమారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సింగరాయపాలెం విద్యార్థిని



సానియాతో హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు

కొణిజర్ల: కొణిజర్ల మండలం సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని షేక్ సానియా అండర్-16 విభాగం పరుగు పందెంలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఖమ్మంలో ఇటీవల జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన ఆమెను హనుమకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సానియాను శనివారం హెచ్‌ఎం కె.లక్ష్మీనారాయణ, పీడీ ఎస్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

పోడు భూముల సర్వే



లింగగూడెం బీట్‌లో సర్వే చేస్తున్న ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ అధికారులు

పెనుబల్లి: మండలంలోని తాళ్లపెంట, లింగగూడెం బీట్ పరిధిలో పోడు చేసుకుంటున్న పోడుదారులకు, అటవీశాఖ అధికారులకు గత కొంతకాలంగా వాగ్వివాదం నడుస్తుంది. లింగగూడెం రైతులు ఏళ్లుగా సాగుచేసుకుంటున్నామని తెలుపుతుండగా, ఇది రిజర్వ్ ఫారెస్ట్ అని అధికారులు పోడును అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు.. పోలీసుల బందోబస్తు నడుమ పోడు భూమిలో సర్వే చేపట్టారు. పోడుదారులు తమకు సంబంధించిన హక్కు పత్రాలను సమర్పించాల్సిందిగా ఆర్ఐ సక్రూ నాయక్.. పోడు దారులకు, ఫారెస్ట్ అధికారులకు తెలిపి పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

దెందుకూరులో డెంగీ కేసు

మధిర: మండలంలోని దెందుకూరు గ్రామంలోని రామ్‌నగర్‌కాలనీలో శనివారం డెంగీ పాజిటివ్ కేసు నమోదైంది. గ్రామంలో ఆదిమూలం రవీందర్ గత మూడు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం మధిరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. అతనికి పరీక్షలు చేయగా.. డెంగీ నిర్ధారణ అయింది. దీంతో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండల అధికారులు గ్రామంలో పర్యటించి బ్లీచింగ్ చల్లించి దోమల నివారణ మందును పిచికారీ చేయించారు.

ప్రగతి పథంలో ‘ఐకేపీ’

- మహిళలకు ఆర్థిక స్వావలంబన ప్రగతిలో ముందంజ
- పలు వ్యాపారాల్లో రాణిస్తున్న మహారాణులు



ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) చైతన్య మండల మహిళా సమాఖ్య ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన పొందే దిశగా చేయూతనిస్తుంది. మండలంలోని 31గ్రామ పంచాయతీల్లో మొత్తం 49గ్రామ సమాఖ్యలున్నాయి. ఇందులో 1,134 స్వయం సహాయక గ్రూపులు. 11,638మంది మహిళలు మండల సమాఖ్యలో సభ్యులుగా ఉన్నారు. గ్రూపుల్లోని మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు బ్యాంక్ లింకేజీతో పాటు స్త్రీనిధి, సామాజిక పెట్టుబడి నిధి స్కీంల ద్వారా రుణాలనిస్తున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 162 గ్రామ సమాఖ్య సంఘాలకు వడ్డీలేని రుణాలు రూ.25.39 కోట్ల మేరకు బ్యాంకు లింకేజీ ద్వారా పంపిణీ చేశారు. బ్యాంక్ లింకేజీలో చైతన్య మండల సమాఖ్య జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచింది.

నిలదొక్కుకుంటున్న సభ్యులు..

గ్రామాల్లో పాల ఉత్పత్తులను పెంచే దిశగా ఇందిరా మహిళా డెయిరీ సెంటర్లు, కట్లేరులో ఇసుక రీచ్‌లు నిర్వహణ, ధాన్యం, పసుపు కొనుగోళ్లు, చిల్లర దుకాణాల ఏర్పాటు, ఆర్టీసీ బస్సుల కొనుగోలు ఇలా అనేక రకాల వ్యాపారాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు చురుకుగా పనిచేస్తూ సమాజంలో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. వ్యాపారాల్లో రాణిస్తూ మహారాణులుగా నిలుస్తూ.. ఆర్థిక స్వావలంభన పొందుతున్నారు.



ఎర్రుపాలెంలో స్త్రీ టీ దుకాణం నడుపుతున్న సునీత

అంతే కాకుండా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఐకేపీ ద్వారా ఇందిరా మహిళా డైరీని ఏర్పాటు చేశారు. గతేడాది నవంబర్ నెల నుంచి నేటి వరకు లక్ష లీటర్ల మేరకు పాల ఉత్పత్తుల సేకరించారు. ప్రభుత్వం ప్రోత్సాహక నగదుగా లీటర్‌కు రూ. 2.5 చొప్పున రూ.2.50లక్షల నగదును ఇందిరా డెయిరీకి జమ చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు 80శాతం, మైనార్టీ, ఓసీ మహిళలకు 70శాతం సబ్సిడీతో మండలంలోని 4వేల మంది మహిళలకు రూ.2లక్షలతో రెండేసి గేదెలు చొప్పున పంపిణీ చేసేందుకు కసరత్తులు చేస్తున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగ వేగంగా సన్నాహాలు చేస్తున్నారు.

ఐకేపీ ఆదాయ వివరాలిలా..

- బనిగండ్లపాడు, ఎర్రుపాలెం, మీనవోలు, తక్కెళ్ళపాడు తదితర గ్రామాల్లో స్థానిక గ్రామ సమాఖ్యల ద్వారా రబీలో 33వేల 800 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా త్వరలోనే సభ్యుల ఖాతాల్లో రూ, 10.14లక్షల కమిషన్ జమ కానుంది. ఇటీవల ప్రభుత్వం ఇసుక రీచ్‌ల నిర్వహణ కూడా ఐకేపీ గ్రామ సమాఖ్య సభ్యులకే అప్పగించగా కట్లేరులోని రాజులదేవరపాడు, బనిగండ్లపాడు, మీనవోలు గ్రామాల్లో స్థానిక గ్రామ సమాఖ్య సభ్యుల ద్వారా ఇసుక రీచ్‌ల నిర్వహణ చేస్తూ రూ. 6.59 లక్షల మేరకు సంపాదించారు.



నారాయణపురంలో పసుపు కొనుగోలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- చైతన్య మండల సమాఖ్య (ఐకేపీ)ద్వారా ఓ బస్సును కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చారు. ఈబస్సు కొనుగోలుకు జాతీయ గ్రామీణ జీవనోపాదుల సంస్థ రూ.30లక్షల ఆర్థికసాయం చేయగా ఐకేపీ రూ.6లక్షల పెట్టుబడి పెట్టింది. ప్రస్తుతం కొనుగోలు చేసిన బస్సును ఆర్టీసీకి అద్దెకు ఇవ్వగా ప్రతి నెలా రూ.69,468 రూపాయల మేరకు ఆర్టీసీ ఐకేపీకి చెల్లిస్తుంది. ఇదంతా సమాఖ్య సభ్యులందరికీ చెందుతుంది.
- మండలంలోని రాజులదేవరపాడు, ఎర్రుపాలెం, పెద్దగోపవరం గ్రామాల్లో 4చోట్ల స్త్రీ టీ షాపులను స్థానిక సమాఖ్య సభ్యులతో ఏర్పాటు చేశారు. వీటికి రూ. 1.30లక్షల రుణాలు పంపిణీ చేయగా.. మహిళలు కుటుంబాలకు ఆర్థిక చేయూతనిస్తున్నారు.
- మండలంలోని నారాయణపురం, నర్సింహాపురం తదితర గ్రామాల్లో పసుపు సాగు చేస్తున్న రైతుల వద్ద ఐకేపీ ద్వారా పసుపు కొనుగోలు సైతం చేస్తున్నారు. ఇప్పటికే 10మంది రైతుల నుండి 682 క్వింటాల్ పసుపును రూ. 75.74 లక్షల మేరకు కొనుగోలు చేశారు. దీంతో ఐకేపీకి రూ.75 వేల ఆదాయం వచ్చింది.

ఐకేపీ ద్వారా రుణాలు..



మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకే ఐకేపీల ద్వారా రుణాలు పంపిణీ చేస్తున్నాం. వీటితో మహిళలు పలు వ్యాపారాలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇందిరమ్మ గృహాలకై రూ. 97.95 లక్షల రుణాలు అందించాం. ఆర్టీసీకి బస్సు అద్దెకు పెట్టడం ద్వారా మంచి ఆదాయం లభిస్తుంది.

– హరినారాయణ, ఏపీఎం, ఎర్రుపాలెం

ఆర్థికంగా ఎదుగుతున్నారు..



తెల్లపాలెం గ్రామ సమాఖ్య ద్వారా గ్రామంలో పిష్‌పాండ్(చేపల పెంపకం చెరువు), కిరాణా, ఫ్యాన్సీ, పిండి మిల్లు దుకాణం, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ షాపుల ఏర్పాటుకు గానూ రూ.6లక్షల మేరకు సమాఖ్యలోని మహిళలకు రుణాలు పంపిణీ చేశాం. రుణాలు పొందిన మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు.

– శీలం కనకదుర్గ, మదర్ థెరిస్సా గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, తెల్లపాలెం

జీవనోపాధికి ఇబ్బంది లేదు..



మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఐకేపీ ద్వారా స్త్రీ టీ షాపు నిర్వహిస్తున్నా. ఈ దుకాణం పెట్టుకునేందుకు చైతన్య మండల సమాఖ్య ద్వారా రూ. 1.30లక్షల మేరకు రుణం మంజూరు చేసింది. ఈ వ్యాపారంతో ప్రతి రోజు కనీసం రూ.1,000 మేరకు ఆదాయం సంపాదిస్తున్నా.

– దేవరకొండ సునీత, ఎర్రుపాలెం

ఉన్నత లక్ష్యంతో చదవండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మండలం కిష్టారం ప్రాథమిక పాఠశాలకు సింగరేణి సీఎస్ఆర్ నిధులతో మంజూరైన బెంచీలు, ర్యాక్‌లు, బీరువాలు, కుర్చీలను శనివారం ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సింగరేణి పీఓ నర్సింహారావు, ఎంఈఓ రాజేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ ఏరియా కార్యదర్శి అప్పారావు, శ్రీనివాస్, అప్పారావు, చెన్నారావు, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓతో ఉద్యోగులు

వైరారూరల్: వైరా ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా తేజావత్ సక్రియ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వైరా ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన పి.సరస్వతి జూలై 31న పదవీ విరమణ పొందారు. కాగా, ఖమ్మంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో డీపీఓగా విధులు నిర్వహిస్తున్న సక్రియ, జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వుల మేరకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన

బోనకల్: వైరా ఏడీఈ కిరణ్‌కుమార్ వైఖరిని నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు. గతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలోనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు తెలుపగా.. ఏడీఈ వినకుండా పది అడుగుల దూరంలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను నిర్మించారు. దీనితో ఆగ్రహించిన సీపీఎం నాయకులు విద్యుత్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఏఈ మనోహర్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీపీఎం నాయకులు వీరభద్రం, చంద్రయ్య, వాణి, కమలమ్మ, మంగమ్మ, వెంకటనర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెస్పీ డొంకను రక్షించాలి

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆక్రమణకు గురైన ఎన్నెస్పీ కాలువ, ప్రభుత్వ డొంకను కాపాడాలని తహసీల్దార్ రమాదేవికి, ఇరిగేషన్ అధికారులకు స్థానిక రైతులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వేనెంబర్ 61, 62, 102, 103లలో 30 అడుగుల డొంకతో పాటుగా ఎన్నెస్పీ కాలువను పూడ్చివేసి ఆక్రమించాడని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి అందించిన వారిలో నరసింహారావు, రవి, అంజి, ప్రకాశ్, జయరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులతో ఆటలాడిస్తున్న అధ్యాపకులు

వైరా: విద్యార్థులు అన్ని రంగాల్లో సమగ్ర అవగాహనతో ముందుకు వెళ్లాలని వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి అన్నారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు శనివారం కళాశాలలో.. క్రీడా సమావేశంతో పాటు కళాశాల శుభ్రం చేయించే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఒత్తిడిని జయించడం, జ్ఞాపక శక్తిని పెంచుకోవడం విషయాలపై అవగాహన కల్పించారు.

మడుపల్లి పాఠశాలలో ‘చెలిమి - అంకురం’

మధిర: మండలంలోని మడుపల్లి పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ‘చెలిమి - అకురం’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంసీ ఉమెన్స్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ అధికారి సంధీన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎదురవుతున్న ఒత్తిళ్లు ఎదుర్కొవడానికి, వ్యాపారంలో నిలదొక్కుకునేందుకు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తోట నర్సింహారావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వేమిరెడ్డి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

భూభారతితో భూమికి భద్రత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్, పక్కన సునీల్ తదితరులు

కారేపల్లి: భూభారతి చట్టం ద్వారా రైతుల భూములకు భద్రత లభించనుందని చట్టం రూపకల్పన సభ్యుడు సునీల్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. మండలంలోని అప్పాయిగూడెం రైతువేదికలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో సునీల్ మాట్లాడారు. భూభారతిలో కాస్తు కాలమ్ ఉన్నందున ఎవరికీ నష్టం జరగదని తెలిపారు. ప్రతీ ఎకరాకు పట్టాదారు పాసుపుస్తకాలు లభిస్తాయని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్ మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన చట్టాలను అడ్డం పెట్టుకొని గిరిజనేతరులను ఇబ్బంది పెటొద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అండగా నిలిచేలా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ అనంతుల రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఏఓ భట్టు అశోక్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సీఈఓ బొల్లు హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



సత్తుపల్లిటౌన్: జలగంనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ సుజాత, సిబ్బంది

సత్తుపల్లిటౌన్/సత్తుపల్లిరూరల్/తల్లాడ/ఏన్కూరు/బోనకల్: తల్లిపాలే బిడ్డకు మొదటి ఆరు నెలల వరకు సంపూర్ణ ఆహారమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, గంగాజలం, భవాని, కె.సత్యావతి, రమాదేవి తెలిపారు. శనివారం సత్తుపల్లి పట్టణంలోని జలగంనగర్, తాళ్లమడ గ్రామాల్లో, తల్లాడలోని గోపాలపేటలో, ఏన్కూరులోని జన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో, బోనకల్‌లోని రామాపురం, ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మునగాకు ఉపయోగాలు వివరించి ఆహారంలో బాలితలు, గర్భిణులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శారారాణి, హెచ్‌ఎం నర్సింహారావు, అంగన్‌వాడీ టీచర్లు సత్యవేణి, నాగలక్ష్మి, సుశీల, పుల్లమ్మ, శాంతకుమారి, సరస్వతి, సరస్వతి, ఏఎన్‌ఎం నాగమణి, రామేశ్వరి, విజయలక్ష్మి, డాక్టర్ శ్రవన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ విభేదాలు సృష్టిస్తోంది’

కారేపల్లి: బనకచర్ల వివాదాన్ని తెరమీదకు తెచ్చి.. ఆంధ్ర, తెలంగాణకు మధ్య ప్రాంతీయ విభేదాలు సృష్టించాలని బీఆర్‌ఎస్ చూస్తుందనిటీడీపీ జిల్లా నాయకుడు మండెపూడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం కారేపల్లిలో నిర్వహించిన తెలుగు దేశం పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పదేళ్ల పాలనతో కేసీఆర్ కుటుంబం అవినీతి అక్రమాలకు పాల్పడిందని, వాటిని కప్పిపుచ్చుకునేందుకు బనకచర్ల వివాదాన్ని తెరపైకి తీసుకొస్తున్నారన్నారు. సమావేశంలో అప్పారావు, జనార్ధన్‌రావు, రామయ్య, రాజు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌టీఎఫ్ఐ రజతోత్సవాలు

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు జిల్లాపరిషత్ పాఠశాలలో శనివారం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) రజతోత్సవాల సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని యూటీఎఫ్ సంఘం సీనియర్ నాయకుడు నీలం అజయ్‌కుమార్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 8 నుంచి 10 వరకు కలకత్తాలో నిర్వహించే ఎస్‌టీఎఫ్ఐ రజతోత్సవ మహాసభలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, నాయకులు తదితరులున్నారు.

ఏన్కూరులో పారిశుద్ధ్య కార్యక్రమాలు

ఏన్కూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పీహెచ్‌సీ పరిసరాల్లోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పంచాయతీ కార్యదర్శి రాంకీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

మధిర: మండలంలోని రామ్‌నగర్‌లో శనివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. సిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఇంటింటి సర్వే నిర్వహించి నీటి నిల్వలు తొలగించడంతో పాటు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి పృధ్వీరాజ్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నేరడలో చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో లబ్ధిదారులకు శనివారం కాంగ్రెస్ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న మండవ బాలమ్మ, చెవుల లింగబాబు లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.85 వేల చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గోపాలరావు, కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, శ్రీను, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర’



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

బోనకల్: జాతీయ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ.. ఎత్తివేసే కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏఐఏడబ్ల్యూయూ నాల్గో మండల మహాసభను నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకోగా.. మండల ప్రధాన కార్యదర్శిగా ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బంధం శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా బోనకల్‌కు చెందిన తెల్లాకుల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 20మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, వెంకటరాజ్యం, భద్రాచలం పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

విద్యార్థులకు బ్యాగ్‌లు, పలకలు..

సత్తుపల్లి: మండలంలోని బాసారం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నవచైతన్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన విద్యార్థులకు రూ.5వేలు విలువైన స్కూల్ బ్యాక్‌లు, పలకలను అందించారు. అమెరికాకు చెందిన చాడా నిఖిల్, ప్రవంతిల కుమార్తె తారా రెండో పుట్టినరోజు వేడుకల సందర్భంగా వీటిని పంపిణీ చేశారు. ఐ.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం సత్తార్, కిరణ్ పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, వాటర్‌బాటిళ్లు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన గణిత ఉపాధ్యాయుడు భీమిరెడ్డి నాగిరెడ్డి శనివారం పాఠశాలకు రూ.31వేలు విలువైన లెనోవా కంప్యూటర్ అందించారు. అదే విధంగా పాఠశాలలోని 80మంది విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది.

విద్యార్థులకు సైకిళ్లు..

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన ఏడుగురు విద్యార్థులకు భీమవరం గ్రామానికి చెందిన దాత, కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డి సైకిళ్లు వితరణ చేశారు. సైకిళ్లను శనివారం మామునూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకమ్మ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు.. పూర్ణచంద్రారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, పుల్లయ్య, జమలయ్య, బాబి, శంకర్, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దినేష్‌కు దుస్తులు, చెకిన్ బ్యాగ్..

తల్లాడ: బిల్లుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సాంబత్తిని దినేష్ ఎస్సెస్సీలో మండలంలో రెండో ర్యాంక్ సాధించడంతో ఉపాధ్యాయులు శనివారం దుస్తులు, చెకిన్ బ్యాగ్ అందజేశారు. బిల్లుపాడు కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కిషోర్ చేతుల మీదుగా అందజేశారు. దినేష్ చదువుల నిమిత్తం కొంత నగదు అందించి.. అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జోజప్ప పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన లక్ష్మీశెట్టి రామారావు(46) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్న ఆయన శుక్రవారం కలుపు నివారణ మందు తాగడంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

బొలేరో వాహనం చోరీ..

మండలంలోని లచ్చగూడెంలో చిక్కు వెంకటేశ్వర్లుకు చెందిన బొలేరో వాహనం శుక్రవారం రాత్రి చోరీకి గురైంది. ఇంటి ముందు నిలిపిన వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని, వాహనం విలువ రూ.9 లక్షలు ఉంటుందని ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బాలికను వేధించిన యువకుడిపై కేసు

తల్లాడ: తల్లాడలో మైనర్ బాలికను వేధించిన యువకుడిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లాడకు చెందిన అనిశెట్టి మోహన్‌కుమార్ 16ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని వేధించడమే కాక పెళ్లి చేసుకోకపోతే చనిపోతానని శనివారం బెదిరించాడు. దీంతో బాలిక కుటుంబీల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ తెలిపారు.

అన్యాయంగా దాడి చేశారు..

కారేపల్లి: కొందరు వ్యక్తులు కావాలనే తమపై అన్యాయంగా దాడి చేశారని మండలంలోని గోవింద్‌తండా గ్రామానికి చెందిన బర్మావత్ రాందాస్ కుటుంబీకులు తెలిపారు. ఈమేరకు శనివారం వారు వివరాలు వెల్లడించారు. గ్రామంలో బర్మావత్ భద్రుకు ఎకరం భూమితో పాటు తమకు 1.30 ఎకరాల భూమి ఉందని తెలిపారు. తమ భూమిలో భద్రు కుటుంబం పత్తి సాగు చేస్తుండగా పోలీసులకు ఫిర్యాదు చేసి కోర్టుకు వెళ్లామని వెల్లడించారు. అయినా స్పందన లేకపోవడంతో తమ భూమిని దున్నగా, దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

వన మహోత్సవం

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండి జీపీ ఆధ్వర్యంలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ వీధులు, రామాలయం, వైకుంఠధామం, శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం, ప్రభుత్వ పాఠశాలల మైదానాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, గ్రామ ప్రముఖులు నారపరెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రిటైర్డ్ ఏఎస్సై రామారావు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ పుల్లాదాసు తదితరులు పాల్గొన్నారు.